క్లుప్తంగా

క్రికెట్ కిట్ల పంపిణీ



క్రీడాకారులకు క్రికెట్ బ్యాట్లను అందజేస్తున్న కాటసాని ఓబులరెడ్డి

బనగానపల్లె: పట్టణంలోని ఖాజీవాడ కాలనీ యువతకు ఆదివారం ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు, వైఎస్సార్‌సీపీ యువ నాయకుడు కాటసాని ఓబులరెడ్డి క్రికెట్ కిట్లు పంపిణీ చేశారు. క్రీడల పట్ల యువత ఉత్సాహంగా ఉండాలన్నారు. క్రీడాకారులకు తమవంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా ఓబులరెడ్డి తెలిపారు. విద్యార్థులు చదువుతోపాటు క్రీడలపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సురేష్, యూసుఫ్, మాబాషా, అబ్బాస్, మలీ, హర్షద్, వసీం తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రత పాటించాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు

బనగానపల్లెరూరల్: ప్రతిఒక్కరూ వ్యక్తిగతంతోపాటు పరిసరాల శుభ్రతను పాటించాలని టంగుటూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శివశంకరుడు సూచించారు. పట్టణంలోని రవ్వలకొండపై ఉన్న ఏపీ మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో ప్రపంచ దోమల నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హాస్టల్ పరిసరాల్లో చెత్తచెదారం, మురుగు నీరు లేకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని, రాత్రి దోమ తెరాలను వాడాలని సూచించారు. జ్వరం, విరోచనాలు, తలనొప్పి తదితర లక్షణాలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలని చెప్పారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ కనకరత్నాచారి, ఏఎన్ఎం గ్రేసమ్మ, వార్డెన్ పార్వతి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


రాజీవ్‌గాంధీ జయంతి



రాజీవ్ గాంధీ చిత్ర పటానికి నివాళ్లు అర్పిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాయలంలో ఆదివారం దివంగత ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నియోజకవర్గ సమన్వయ కర్త డాక్టర్ గార్లపాటి మద్దిలేటి, నాయకులు జనార్దన్, శేఖర్, సుబ్బుయాదవ్, వడ్డె రాజశేఖర్, గోపీనాథ్‌రావు, విజయ్, హసన్, చిన్న ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కార్పెంటర్ల సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక



కార్యక్రమంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

కోవెలకుంట్ల: స్థానిక పాండురంగస్వామి దేవాలయ ఆవరణలో కోవెలకుంట్ల మండల కార్పెంటర్ల సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ముత్యాల రామాంజనేయులు, ఉపాధ్యక్షుడిగా ఎస్.వలి, కోశాధికారిగా రమణ, కార్యదర్శిగా రమేష్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధంగా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్పెంటర్ల అభివృద్ధికి కృషి చేస్తామని ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతి చెందిన గాజుల వినయ్ కుమార్..

అవుకు:అవుకు పట్టణానికి చెందిన గాజుల వినయ్ కుమార్(29) కర్నూలు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక ఆదివారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఆంజనేయ స్వామి ఆలయ సమీపంలో నివాసం ఉంటున్న గాజుల వినయ్‌కుమార్ తాగుడుకు బానిసకావడంతో ఈ నెల 7వ తేదీన అతని తల్లిదండ్రులు మందలించారు. దీంతో మనస్తాపానికి గురై గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అవుకు ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడి నుంచి బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం నంద్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడని భార్య గాజుల లావణ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.

గ్రామీణుల ఆరోగ్యానికీ భరోసా!

- వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు
- పల్లెలకు వెళ్లి వైద్యసేవలు అందజేస్తున్న డాక్టర్లు
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కొత్తపల్లెలో శిశువుకు వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్,



మాధవరం విలేజ్ క్లినిక్‌లో మహిళలకు వైద్యసేవలు అందిస్తున్న దృశ్యం

డోన్ : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య, విద్య, వ్యవసాయ రంగాలకు అత్యధిక ప్రాధాన్యనిస్తుంది. వైద్య రంగంలో ప్రభుత్వం విప్లవాత్మక మార్పులు చేపట్టింది. పల్లెల్లోనూ సకల వైద్యం అందజేయడమే లక్ష్యంగా విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసింది. గ్రామీణుల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుంది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం. ఆరోగ్యశ్రీ, పరిధిని పెంచిన ప్రభుత్వం విలేజ్ హెల్త్ క్లినిక్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లలో అధునాతన వైద్యం అందజేస్తుంది. ప్రత్యేకించి ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ అందరి మన్ననలు పొందుతుంది. విలేజ్ క్లినిక్ సిబ్బంది సైతం గ్రామాల్లో పర్యటిస్తూ ఆరోగ్యంపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చైతన్యపరుస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమంలో భాగంగా పీహెచ్‌సీ వైద్యులు వారానికి రెండు రోజులు పల్లెలకు వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నారు. మంచానికే పరిమితమైన రోగులతోపాటు వృద్ధులకు ఇళ్ల వద్దకే డాక్టర్లు వెళ్లి వైద్యసేవలు అందజేస్తున్న తీరుపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ప్రతి పంచాయతీ కేంద్రంలో విలేజ్ క్లినిక్

ఈ ఏడాది ఆరంభంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విలేజ్ క్లినిక్‌లను ఏర్పాటు చేసి ప్రతి పంచాయతీ కేంద్రంలోనూ సొంత భవనాలను ఏర్పాటు చేస్తోంది. ప్యాపిలి మండలంలో 24 నిర్మాణం చేపట్టగా, మాధవరం విలేజ్ క్లినిక్ ప్రస్తుతం వైద్యసేవలు అందిస్తోంది. మిగిలిన 23 విలేజ్ క్లినిక్ భవనాలు వివిధ దశలలో రూపుదిద్దుకుంటున్నాయి. బేతంచెర్ల మండలానికి 15 విలేజ్ క్లినిక్‌లు మంజూరు కాగా, సీతారామపురం, గోరుమానుకొండ గ్రామాలలో ఇప్పటికే విలేజ్ క్లినిక్‌ల ద్వారా ప్రజలకు వైద్యసేవలందిస్తున్నారు. మిగిలిన 13 భవనాలు పూర్తికావాల్సి ఉంది. డోన్ మండలానికి 8 విలేజ్ క్లినిక్‌లు మంజూరు కాగా, ప్రస్తుతం యు.కొత్తపల్లెలో నిర్మించిన క్లినిక్‌లో ప్రజలు వైద్యసేవలు అందిస్తున్నాయి. ఒకొక్క కేంద్రంలో ప్రతిరోజు 30 నుండి 50 వరకు ఓపీలు నమోదవుతున్నట్టు సమాచారం.

ప్రజల చెంతకే వైద్యం



ప్రజల వద్దకే పాలన సాగిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల చెంతనే వైద్య సేవలు అందజేస్తుంది. గతంలో ప్రతి చిన్న ఆరోగ్య సమస్యకు మైళ్ల దూరంలో ఉన్న వైద్యశాలలకు వెళ్లాల్సి వచ్చేది. తద్వారా సమయం, డబ్బు వృథా అయ్యేది. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వంలో గ్రామీణస్థాయిలో సైతం వైద్యులు ఇంటివద్దకే వచ్చి సేవలు అందజేస్తున తీరు అభినందనీయం.

– వై.విద్య, సర్పంచ్, యు కొత్తపల్లి గ్రామం, డోన్ మండలం.

వైద్యం కష్టాలు తొలిగాయి



వయసు మీద పడటంతో నాలాంటి వారికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయి. నాకు బీపీ, షుగర్ లాంటి సమస్యలు ఉన్నాయి. వైద్యం కోసం పీహెచ్‌సీలకు వెళ్లాలంటే ఒక్కరోజంతా వ్యయప్రయాసాలు పడాల్సి వచ్చేది. ప్రస్తుతం రెండు వారాలకు ఒకసారి ఇంటివద్దకే డాక్టర్ వచ్చి వైద్యచికిత్సలు అందిస్తున్నారు. ఉచితంగా మందులు కూడా అందజేయడం సంతోషకరం.

– నైనూరి బాలనాగమ్మ, మాధవరం, ప్యాపిలి మండలం.

అన్నిరకాల వైద్యసేవలు అందిస్తున్నాం



ప్రజలకు దాదాపు అన్నిరకాల వైద్య సేవలు అందజేస్తున్నాం. ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లోనూ అంకితభావంతో ప్రజలకు వైద్య సేవలు అందజేస్తున్నాం. ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కార్యక్రమం ద్వారా మంచానికే పరిమితమైన రోగులకు ఇళ్ల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందజేస్తున్నాం. పల్లెల ప్రజలు వైద్య సేవలపై వ్యక్తం చేస్తున్న తీరు సంతృప్తినిస్తుంది.

– డాక్టర్ రాంభూపాల్, వైద్యులు,కొత్తబురుజు పీహెచ్‌సీ, డోన్ మండలం.

బేతంచెర్లలో అన్ని రైళ్లను ఆపాలి

బేతంచెర్ల: స్థానిక రైల్వే స్టేషన్‌లో అన్ని రైళ్లను ఆపాలని డిమాండ్ చేస్తూ ఆదివారం సీపీఐ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. సత్రం దగ్గర నుంచి పాత బస్టాండు మీదుగా రైల్వే స్టేషన్ వరకు ర్యాలీ నిర్వహించి రైల్వే సిబ్బందికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ప్రజల సౌకర్యార్థం అన్ని రైళ్లను ఆపేలా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్, పట్టణ కార్యదర్శి నాగరాజు అధికారులను కోరారు.

తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు

బేతంచెర్ల: పట్టణంలోని శేషారెడ్డి ఉన్నతపాఠశాల ఆవరణలో ఆదివారం అమెచ్యూర్ తైక్వాండో బెల్టు గ్రేడింగ్ పోటీలు ఇన్‌స్ట్రక్టర్ నాగన్న ఆధ్వర్యంలో నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 150 మంది విద్యార్థులు పోటీ పడ్డారు. అమృత, సుచరిత, రుద్రతేజ, మనస్వినీ, సులేమాన్, తెహరసీన్, ఫర్హీన్, స్వప్న హయ్యర్ బెల్టు సాధించారు.

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏడీఈ ఖాజావలి చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

ఈ క్రాప్ బుకింగ్ తప్పనిసరి



పంట నమోదు చేస్తున్న వీహెచ్‌ఏ

ప్యాపిలి: సాగు చేస్తున్న పంటలను తప్పనిసరిగా రైతులు ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని గ్రామ ఉద్యానశాఖ సహాయకులు షానవాజ్ తెలిపారు. మండల పరిధిలోని గుడిపాడు గ్రామంలో ఆదివారం ఆయన తన సిబ్బందితో కలసి మద్దయ్య, నాగిరెడ్డి, హర్షవర్ధన్ రెడ్డి తదితర రైతుల పొలాల్లో ఈ క్రాప్ బుకింగ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటనష్ట జరిగితే అందజేసే పరిహారం, పంటలబీమా వంటి పథకాలకు ఈ క్రాప్ బుకింగ్‌ను ప్రభుత్వం ప్రామాణికంగా తీసుకుంటుందని తెలిపారు. రైతులు ఏ పంటను సాగు చేశారో అదే పంటకు ఈ క్రాప్ నమోదు అవుతుందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

వధూవరులను ఆశీర్వదించిన మంత్రి బుగ్గన



వధూవరులతో మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి

డోన్ టౌన్ : పట్టణంలోని వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం జరిగిన మల్లెంపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చె రామచంద్రుడు, మద్దమ్మ దంపతుల కుమారుడి వివాహవేడుకకు మంత్రి బుగ్గనరాజేంద్రనాథ్‌రెడ్డి హాజరయ్యారు. వధూవరులు బ్రహ్మనాయుడు, రమ్యను మంత్రి ఆశీర్వదించారు. అనంతరం సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ ఆల్ ఇండియా కార్యదర్శి మర్రి రాఘవయ్య ఇంటికి వెళ్లారు. మర్రి రాఘవయ్య మనువడు, మర్రి గోవింద రాజు కుమారుడు సిద్దార్థ శ్రేయస్ వివాహం రెండురోజుల్లో జరుగనుంది. సిద్దార్థ శ్రేయస్‌కు మంత్రి ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి వెంట ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, జెడ్పీటీసీ రాజ్‌కుమార్, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రామచంద్రుడు, బొబ్బల శివరామిరెడ్డి, దొరపల్లె చిరంజీవి తదితరులు ఉన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

డోన్ టౌన్ : క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని కౌన్సిలర్ దివేష్‌గౌడ్, లగోరి అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి వెంకట్ బాదుల్, జిల్లా కార్యదర్శి శివ, చైర్మన్ సిద్దార్థ రాజు పేర్కొన్నారు. స్థానిక బాలికల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి లగోరి క్రీడా పోటీలను వారు ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారిని జాతీయ పోటీలకు ఎంపిక చేస్తామని ఈ సందర్భంగా వారు తెలిపారు. కార్యక్రమంలో ఊటకొండ గ్రామ కబడ్డీ సీనియర్ క్రీడాకారుడు షెమ్మిరెడ్డి, క్రీడల నిర్వాహణ కార్యదర్శి మస్తాన్‌వలి, వ్యాయమ ఉపాధ్యాయులు రామకృష్ణుడు, రంగస్వామి, స్వప్న, హరి తదితరులు పాల్గొన్నారు.

పెద్దమ్మ గుడికి రంగుల విరాళం

బనగానపల్లెరూరల్: మండలంలోని టంగుటూరులో వెలసిన శ్రీ పెద్దమ్మ ఆలయానికి ఆదివారం భక్తుడు కొండారెడ్డి సుమారు రూ.15వేల విలువ కలిగిన గోల్డ్ పెయింట్ రంగులను విరాళంగా నిర్వాహకులు నేమలి భాస్కర్‌రెడ్డికి అందజేశారు. అలాగే అవుకు మండలం కునుకుంట్ల గ్రామానికి చెందిన బాలసుబ్బరాయుడు ఆలయాభివృద్ధికి రూ.10వేలు అందజేశారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు



మార్కెట్‌యార్డు సమీపంలో వెలసిన పుట్ట వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నాగులపుట్టకు పూజలు చేస్తున్న భక్తులు

కోవెలకుంట్ల: బనగానపల్లె నియోజకవర్గంలో ఆదివారం నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రాలతోపాటు గ్రామాల్లో మహిళలు పుట్టలవద్దకు తరలివెళ్లి పాలు, నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కోవెలకుంట్ల పట్టణంలోని వివిధ కాలనీలకు చెందిన మహిళలు స్థానిక నాగుల కట్ట వద్ద నాగుల ప్రతిమలకు నైవేద్యం సమర్పించి పూజలు నిర్వహించారు. అదే విధంగా మార్కెట్‌యార్డు ఆవరణ, బనగానపల్లె చౌరస్తా సమీపాల్లోని పుట్టల చుట్టూ మహిళలు ప్రదర్శనలు చేసి పాలుపోసి పూజలు చేశారు.

బేతంచెర్ల: మండలంలో శ్రావణమాసం నాగుల చవితి వేడుకలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నాగుల కట్టల వద్ద, పుట్టల వద్ద మహిళలు, చిన్నారులు, నూతన దంపతులు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. పట్టణంలోని అమ్మవారిశాల నాగుల కట్ట, శేషారెడ్డి హైస్కూలు, తహసీల్దార్ కార్యాలయం సమీపాన పుట్టల్లో మహిళలు పాలు పోసి చీరెలు సమర్పించి చల్లంగా దీవించమ్మ అంటూ నాగమ్మను వేడుకున్నారు.

కొలిమిగుండ్ల: నాగుల చవితి పర్వదిన వేడుకలను మండల వ్యాప్తంగా మహిళలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. పుట్టలు,నాగుల కట్టల వద్దకు మహిళలు, పిల్లలు పెద్ద ఎత్తున చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పుట్టల్లో పాలు పోసి, పిండి వంటలు నైవేద్యంగా సమర్పించారు. పుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

బనగానపల్లెరూరల్: మండలంలో నాగుల చవితి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మండల కేంద్రం బనగానపల్లెలోని ఆంజనేయస్వామి, పాండురంగస్వామి ఆలయాలు, జీఎం టాకీస్ సమీపంలో ఉన్న నాగుల పుట్టలకు మహిళలు పాలు పోసి, చీర, రవిక పసుపు, కుంకుమ, పండ్లు, పిండి వంటలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అవుకు: మండలంలో ఆదివారం నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కాశీవిశ్వనాథస్వామి, బ్రహ్మంగారి మఠాలతో పాటు పలుప్రాంతాల్లోని నాగులకట్టలు, పుట్టలకు భక్తులు కుటుంబ సమేతంగా వెళ్లి పూజలు చేశారు. నాగదేవతలను పత్తితో చేసిన వస్త్రం, వివిధ రకాల పూలతో అలంకరించారు. అనంతరం పుట్టల్లో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు.

డోన్ టౌన్ : నాగుల చవితి పర్వదినాన్ని ఆదివారం భక్తులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలు పిల్లపాపలతో పుట్టలకు పాలుపోసి మొక్కులు చెల్లించుకున్నారు. అదేవిధంగా నూతన వధూవరులు పుట్టల చుట్టూ ప్రదక్షిణలు చేసి పాలుపోసి పూజలు చేశారు. ప్రభుత్వ ఐటీఐ వద్ద ఉన్న శ్రీసుబ్రహ్మణ్యేశ్వరి స్వామి పుట్ట,జడ్జి బంగళా వద్ద ఉన్న పుట్ట, నెహ్రూనగర్ కాలనీలో పుట్ట,కొండపేటలోని చాకిరేవు మిట్ట వద్ద పుట్ట భక్తులతో కిటకిటలాడాయి.



చాకిరేవు మిట్ట వద్ద పుట్టకు పాలు పోస్తున్న దృశ్యం



బేతంచెర్లలో పుట్టకు పూజలు నిర్వహిస్తున్న మహిళలు



కొలిమిగుండ్లలో కొండపై పుట్ట వద్ద పూజలు చేస్తున్న మహిళలు

సత్తాచాటిన వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు

కోవెలకుంట్ల: గ్రామ పంచాయతీ ఉపఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు సత్తాచాటారు. కోవెలకుంట్ల మండలంలోని ఆయా గ్రామాల్లో ఖాళీ అయిన గ్రామ పంచాయతీ వార్డు స్థానాలకు నిర్వహించిన ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కోవెలకుంట్ల మేజర్ గ్రామ పంచాయతీలోని ఆరవ వార్డు, సౌదరదిన్నె, చిన్నకొప్పెర్లలో రెండవ వార్డులు, కలుగొట్లలో తొమ్మిదవ వార్డుకు ఎన్నికలు జరుగగా అన్ని స్థానాలకు ఒక్కోక్కటి చొప్పున నామినేషన్లు దాఖలు కాగా ఏకగ్రీవమయ్యాయి. కోవెలకుంట్ల, సౌదరదిన్నె, చిన్నకొప్పెర్ల వార్డు మెంబర్లుగా వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు కాల్వ శ్రీవాణి, రహినాబీ, దూదేకుల మాబాషా ఎన్నికయ్యారు. గత గ్రామ పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని కలుగొట్లలో తొమ్మిదవ వార్డుమెంబర్‌గా ఎన్నికైన కల్పన అనారోగ్యంతో మృతి చెందింది. వైఎస్సార్‌సీపీ సానుభూతితో వార్డు స్థానానికి అభ్యర్థిని బరిలో నిలుపలేదు. దీంతో టీడీపీకి చెందిన వరలక్ష్మి ఆ స్థానంలో ఏకగ్రీవంగా ఎన్నికైంది. మండలంలోని నాలుగు వార్డు స్థానాల్లో మూడు వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు, ఒక స్థానంలో టీడీపీ మద్దతుదారురాలు విజయం సాధించారు.

వార్డు స్థానం	గ్రామం	వార్డుమెంబర్	పార్టీ
1వ వార్డు	నల్లమేకలపల్లి	లక్ష్మీ అశ్విని	వైఎస్సార్‌సీపీ
2వ వార్డు	కొలుపల్లి	తలారిప్రభాకర్	వైఎస్సార్‌సీపీ
7వ వార్డు	ఎన్. రంగాపురం	లక్ష్మీదేవి	వైఎస్సార్‌సీపీ
7 వ వార్డు	అలేబాదుతండా	లక్ష్మీదేవి బాయి	వైఎస్సార్‌సీపీ




కోవెలకుంట్ల,కాల్వ శ్రీవాణి,సౌదరదిన్నె రహినాబీ



చిన్నకొప్పెర్ల, దూదేకుల మాబాష



అన్నవరం సర్పంచ్ సాయినాథ్ రెడ్డి..



రామాపురం వడ్డె చౌడేశ్వరీ..



కొండమనాయునిపల్లె, ముడావత్ బాలు నాయక్



ఎం,పేండేకల్లు, ఎం వేణుగోపాల్ రెడ్డి



రహిమానుపురం, బీ. ప్రసాద్



లక్ష్మీ అశ్విని



తలారి ప్రభాకర్



లక్ష్మీదేవి



లక్ష్మీదేవి బాయి

అవుకు: గ్రామ పంచాయతీ ఉపఎన్నికల్లో అవుకు మండలానికి ప్రజలు వైఎస్సార్‌సీపీకే మద్దతు పలుకుతూ ఏకగ్రీవం చేశారు. అన్నవరం సర్పంచ్‌గామాదిరెడ్డి సాయినాథ్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అదేవిధఃగా రామాపురం రెండవ వార్డు మెంబర్‌గా వడ్డె చౌడేశ్వరీ, కొండమనాయునిపల్లె ఏడవ వార్డు మెంబర్‌గా ముడావత్ బాలు నాయక్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు.

బేతంచెర్ల: మండల పరిధిలోని ఎం, పేండేకల్లు 10 వార్డు, రహిమానుపురం గ్రామంలో 6వ వార్డు స్థానానికి శనివారం జరిగిన ఎన్నికల్లో రెండు స్థానాలను వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఘన విజయం సాధించారు. ఎం,పేండేకల్లులో మిట్టె వేణుగోపాల్ రెడ్డి, రహిమానుపురంలో బీ. ప్రసాద్ ఎన్నికయ్యారు.

ప్యాపిలి : మండలంలో జరిగిన వార్డు స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులు ముగ్గురు ఏకగ్రీవమయ్యారు. మరోరెండు స్థానాల్లో పార్టీలకు అతీతంగా బరిలోదిగిన అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికలు జరిగిన అలేబాదుతండా ఏడవ వార్డులో వైఎస్సార్‌సీపీ మద్దతుతో లక్ష్మీదేవి బాయి విజయం సాధించారు. ప్యాపిలి రెండవ వార్డులో టీడీపీ అభ్యర్థి గెలుపొదారు.

సంజామల : మండలంలో జరిగిన ఉప ఎన్నికల్లో ఆల్వకొండ ఒకటవ వార్డుమెంబర్‌గా వైఎస్సార్‌సీపీ మద్దతుదారుడు మురళి గౌడ్ ఎకగ్రీవంగా ఎన్నికయ్యారు. పేరుసోముల రెండవ వార్డుకు జరిగిన ఎన్నికల్లో టీడీపీ మద్దతురాలు లత కేవలం ఐదు ఓట్లతో విజయం సాధించారు.

ఆటో బోల్తా ఐదుగురికి గాయాలు

పాణ్యం: మండల పరిధిలోని కొత్తూరు–నందివర్గం గ్రామాల మధ్య జరిగిన రోడ్డు ప్రమాదంలో ఐదుగురికి గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. వివరాల మేరకు బనగానపల్లెకు చెందిన భక్తులు కొత్తూరు సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని దర్శించుకుని వస్తుండగా టైర్ పంక్చర్ కావడంతో ఆటో బోల్తాపండింది. ఆటోలో ప్రయాణిస్తున్న లక్ష్మీదేవి, వరుణ్‌కుమారు, పి లక్ష్మీదేవి, శివలక్ష్మీ, డి లక్ష్మీదేవి, ఎస్ లక్ష్మీదేవికి గాయాలయ్యాయన్నారు. చికిత్స నిమిత్తం బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని చెప్పారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్యాపిలి: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సీపీఐ చేపట్టిన బస్సు యాత్రను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ప్రతాప్ అన్నారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆగస్టు 17 నుంచి సెప్టెంబర్ 8 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన బస్సు యాత్ర సెప్టెంబర్ 3న డోన్‌కు వస్తుందన్నారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పిక్కిలి వెంకటేశ్వర్లు, హమాలి వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీనివాసులు, ఏఐఎస్ఎఫ్ నాయకులు శివ కేశవులు, చంద్రనాయక్, వంశీ, బంగారప్ప తదితరులు పాల్గొన్నారు.

మహానందిలో సండే సందడి



మహానంది: క్షేత్రంలో ఆదివారం భక్తుల సందడి నెలకొంది. సెలవురోజు, నాగులచవితి పర్వదినం కలిసి రావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ముందుగా భక్తులు కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వర స్వామి వార్లను దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేపట్టారు. ఉదయం నుంచి రాత్రి వరకు రద్దీ కొనసాగింది. మహానందీశ్వరస్వామి దంపతులకు రాత్రి ఏకాంత సేవ పూజలు వైభవంగా జరిగాయి.

మహానందీశ్వరుడి సన్నిధిలో జెడ్పీ సీఈఓ

ఉమ్మడి కర్నూలు జిల్లా పరిషత్ సీఈఓ నాసరరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం మహానందికి వచ్చారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన ఆయనకు జెడ్పీటీసీ కేవీఆర్ మహేశ్వరరెడ్డి, జేఏ హేమశంకర్ స్వాగతం పలికారు. ఆయన శ్రీ కామేశ్వరీదేవి సహిత మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని పూజలు చేపట్టారు. దర్శనం అనంతరం స్థానిక అలంకార మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేసి స్వామి, అమ్మవారి ప్రసాదాలు అందించారు. అనంతరం సూర్యనంది ఆలయంలో విశేషపూజలు నిర్వహించారు.

శ్రీశైలంలో అభివృద్ధి పనుల పరిశీలన

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానంలో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలను దేవస్థాన కార్యనిర్వహణాధికారి ఎస్.లవన్న పరిశీలించారు. ఆదివారం దేవస్థాన పరిపాలనాంశాల్లో భాగంగా ఘంటామఠం, విభూతిమఠం, గణేశసదనమును ఇంజినీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రాచీన కట్టడాల పరిరక్షణలో భాగంగా దేవస్థానం పంచమఠాల పునర్నిర్మాణ పనులను చేపట్టి పూర్తి చేశారు. ఇప్పటికే ఘంటామఠానికి సంబంధించి గర్భాలయం, అంతరాలయం, ముఖ మండపం, విమానగోపుర నిర్మాణాలు పూర్తి చేశారు. అలాగే ఘంటామఠ ప్రాంగాణములోని ఉపాలయాలు కూడా పూర్తి చేశారు. మఠాల ప్రాంగాణం చుట్టు పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. వర్షాకాలం పూర్తయ్యేలోగా పనులన్నీ పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఘంటామఠంలోని కొమారీదేవి, పాండవ గుహ వద్ద ఉన్న కాలభైరవ స్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను ప్రారంభించాలని, జటావీరభద్రమఠాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. అనంతరం విభూతిమఠంను పరిశీలించి, మఠం చుట్టు గార్డెనింగ్ ఏర్పాటు చేయాలని సూచించారు. టూరిస్ట్ బస్టాండ్ సమీపంలో భక్తుల వసతి కోసం 220 గదుల సముదాయంగా నిర్మించిన గణేశసదనమును తనిఖీ చేసి వెనుక భాగంలో అడవి జంతువులు రాకుండా కంచె ఏర్పాటు చేయాలని కోరారు. ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్లు వి.రామకృష్ణ, మురళీధర్ రెడ్డి, సీఎస్ఓ శివప్రసాద్, డీఈ చంద్రశేఖర శాస్త్రి, సుబ్బారెడ్డి, ఉద్యానవన అధికారి లోకేష్, విశ్రాంత అసిస్టెంట్ డైరెక్టర్ ఈశ్వరరెడ్డి, ఏఈలు భవన్, విష్ణు, రాజేష్, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.